www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 24 | జూలై | 2026
పేజీలు : 8

## బీరోలులో మరో చోరీ




-వృద్ధ దంపతుల కళ్లల్లో కారం చల్లి మూడు తులాల బంగారు గొలుసు అపహరణ
- వరుస దొంగతనాలతో హడలెత్తుతున్న మండల ప్రజలు
- మహిళల మెడలోని మంగళసూత్రాలే దొంగల టార్గెట్

2లో

# శృతిమించిన వైద్య దోపిడీ..!

-అనుమతి లేని ఆసుపత్రులు.. ల్యాబ్‌లు
-అర్హత లేని సిబ్బంది.. ధనార్జనే ధ్యేయం
-పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ




**ప్రజాపక్షం/ ఖమ్మం :** మనిషి జీవిత కాలంలో ఆహారం, ఇతర అవసరాలకు ఎంత ఖర్చు చేస్తున్నారో దానికి కొన్ని రెట్లు వైద్యానికి ఖర్చు అవుతుంది. మారిన వాతావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్ల నేపథ్యంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీనిని సొమ్ము చేసుకునేందుకు ధనార్జనే ధ్యేయంగా ఆసుపత్రులు ఏర్పాటు చేసి కొందరు కాసుపత్రులుగా మార్చారు. ఈ క్రమంలోనే అనుమతి లేని ఆసుపత్రులు ఇష్టానుసారంగా పుట్టుకొస్తున్నాయి. ల్యాబ్‌ల పరిస్థితి మరీ ఘోరం. అనుమతులు లేకుండానే ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం, అర్హత లేని సిబ్బందిని ఏర్పాటు చేయడం, అందిన కాడికి పిండుకునే పనిలో ఉన్నారు. అనుమతులు లేకుండానే ఆసుపత్రులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేసి అర్హత లేని సిబ్బందితో నిర్వహిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడో, మీడియాలో వార్తలు వచ్చినప్పుడో ఒకట్రెండు ల్యాబ్‌లపై పాక్షిక దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఖమ్మం నగరం వైద్య రంగానికి కేంద్రంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి నల్లగొండ, సూర్యాపేట, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన పలువురు వైద్య చికిత్స పొందెందుకు ఖమ్మంలోని

మిగతా 2లో..

## ఫీజు బకాయిల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు




-బకాయిలు విడుదల చేయకపోతే రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం
-ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు పోరాటం
-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి, ఉద్రిక్తత

3లో

## విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వానికి పతనం తప్పదు

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కే షాహిద్, అవరక అజిత్
- కలెక్టరేట్ ముట్టడి విజయవంతం

సెంటర్ స్ప్రెడ్



## తెలంగాణకు సింగరేణి ఆత్మలాంటిది




-సింగరేణి సంస్థ అప్ డేట్ కాకుంటే
-అంబాసిడర్ కారులా అవుతుంది పరిస్థితి
-సింగరేణి భవిష్యత్తు కోసం సాంకేతికత, నాణ్యతే కీలకం
-ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
-జేవీఆర్ ఓసీ-3 సింగరేణికి కేటాయించాలని జీఎం విజ్ఞప్తి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణకు సింగరేణి ఆత్మ లాంటిదని, సింగరేణి అప్డేట్ కాకుంటే అంబాసిడర్ కార్ పరిస్థితికి వస్తుందన్నారు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క. సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం సింగరేణి గనులను సందర్శించారు. ముందుగా సింగరేణి అతిథి గృహానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జేవీఆర్ ఓసీ ప్రాంతంలో ఓబీ తొలగింపు, బొగ్గు ఉత్పత్తి పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఓబీ (ఓవర్ బర్డెన్) మరియు బొగ్గు కలిసిపోకుండా కచ్చితమైన పర్యవేక్షణ అవసరమని అధికారులకు సూచించారు. రెండూ కలిసిపోతే కాంట్రాక్టర్‌కే లాభం తప్ప సంస్థకు ప్రయోజనం ఉండదన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ద్వారా మాత్రమే సింగరేణి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలదని పేర్కొన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని సంస్థను నిరంతరం నవీకరించుకోవాలని, లేదంటే అంబాసిడర్ కారు పరిస్థితి ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. ప్రైవేట్ సంస్థలకు పోటీగా తక్కువ ధరలో నాణ్యమైన బొగ్గు సరఫరా చేసే విధంగా

మిగతా 2లో..

# శృతిమించిన వైద్య దోపిడీ..!

(మొదటిపేజీ తరువాయి)

ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రజల ఆశలకు అనుగుణంగానే కొన్ని ఆసుపత్రులు విశిష్ట సేవలు అందించి రోగుల ప్రాణాలను కాపాడడంతో పాటు మెరుగైన జీవితాన్ని ఇస్తున్నాయి. కానీ కొన్ని ఆసుపత్రులు మాత్రం కేవలం రోగులను పీల్చి పిప్పి చేసేందుకు తప్ప మరెందుకు పనిచేయడం లేదు. రోగి ఆసుపత్రికి రాగానే ఏదో ఒక వైద్యం చేయడం ఖర్చుకు మూడు రేట్లు బిల్లు వేయడం జరుగుతుంది. అదృష్టం ఉండి బతికితే బిల్లు వస్తుంది పోతే తమకెం బాధ్యత లేనట్లుగా ఆసుపత్రులకు చెందిన వైద్యులు, యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ప్రతి ఆసుపత్రిలోనూ ఫీజుల వివరాలు గోడకు వేలాడుతుంటాయి. కానీ వారు వసూలు చేసే ఫీజులకు ఆ గోడ మీద ఉన్న వివరాలకు అసలు సంబంధం లేదు. వైద్యో నారాయణో హరి భగవంతుని తర్వాత వైద్యునికి మన సమాజం సముచిత స్థానాన్ని ఇచ్చింది. కానీ వైద్యుడు అనే పదానికే అర్థాన్ని మార్చి ఆ పేరుతో వసూల్ రాజాలుగా కొందరు చెలామణి అవుతున్నారు. 200 ఆసుపత్రులు పైబడిన ఖమ్మం నగరంలో అనుమతులు లేని ఆసుపత్రులు యథేచ్ఛగా రోగులకు వైద్యాన్ని అందిస్తున్నాయి. ఇటీవల కాలంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు అన్న పదం బాగా వినియోగంలోకి వచ్చింది. ఒక వైద్యుడు ఉండటం, మల్టీ ఆసుపత్రి పేరుతో ఆసుపత్రి నిర్వహించడం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకమే. కానీ పలువురు వైద్యుల పేర్లు కనపడుతుంటాయి. కానీ వారు ఆ ఆసుపత్రికి రాని సందర్భాలు అనేకం.

**ఆర్ఎంపిలపైనే ఆధారపడిన ఆసుపత్రులు...**

కొన్ని ఆసుపత్రులు కేవలం ఆర్ఎంపిలపై ఆధారపడి పనిచేస్తున్నాయి. గ్రామీణ పేదలకు సత్వర వైద్యం అందించే క్రమంలో రూపుదిద్దుకున్న ఆర్ఎంపిల వ్యవస్థ ఇప్పుడు ఆసుపత్రులకు ఆదాయ వర్గాలుగా మారింది. అసలు అయిన ఖర్చు కంటే అదనంగా రోగి వద్ద నుంచి వసూలు చేయడం అందులో ఆర్ఎంపిలకు వాటా ఇవ్వడం ఇప్పుడు చాలా ఆసుపత్రులకు అలవాటుగా మారింది. కొందరు వైద్యులైతే తమ ఆసుపత్రుల్లో ఆర్ఎంపిలకు సకాల సౌకర్యాలు కల్పిస్తున్నారన్న వాదన వినిపిస్తుంది. ఇప్పుడు ఆర్ఎంపిలను ఆశ్రయించకపోతే ఆసుపత్రులు మూతపడే పరిస్థితి వచ్చిందన్న ప్రచారం జోరుగా సాగుతుంది. ఆసుపత్రులు ఆర్ఎంపిలకు కమిషన్లు ఇచ్చే క్రమంలో రోగిని పీల్చి పిప్పి చేస్తున్నారు. ఆర్ఎంపి చెప్పింది తలపండిన వైద్యులు సైతం చేస్తున్నారని ఆపరేషన్లు లేదా ఇతర వైద్యం అవసరం లేకపోయినా చేసి వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో అనుభవం లేని వైద్యులు కూడా ఉన్నారు. ఎముకల డాక్టర్ పేరుతో ఆసుపత్రి ప్రారంభించిన ఆయన ఇతర జబ్బులకు వైద్యం అందిస్తూ వికటించినప్పుడు పరిహారం చెల్లించడం చేస్తున్నాడని వికటించిన పక్షంలో బిల్లు వసూలు చేస్తున్నాడని ఆరోపణలు వినవస్తున్నాయి.

**అనుమతులు లేని ల్యాబ్‌లు, అనవసర పరీక్షలు...**

ల్యాబ్ ఏర్పాటుకు అనుమతి తీసుకోవడంతో పాటు ల్యాబ్‌లో పనిచేసే సిబ్బంది అర్హతలను కూడా విధిగా తెలియజేయాల్సి ఉంది. ఒకవేళ ల్యాబ్‌లో పనిచేసే సిబ్బందిలో మార్పులు జరిగితే ఆ విషయాన్ని కూడా వైద్య ఆరోగ్య శాఖకు తెలియజేయాల్సి ఉంది. కానీ ఇటువంటి పని ఏ ల్యాబ్ నిర్వాహకులు చేయడం లేదు. ఇటీవల ఓ యువకుడు ఆందోళనగా ఉండని ఓ ల్యాబ్ వద్దకు వెళితే 220 బిపి ఉందని చెప్పి అతన్ని మరింత ఆందోళనకు గురిచేశాడు. అతను కంగారు పడుతూ మిత్రులకు ఫోన్ చేసి చెబితే అందరూ ఆశ్చర్యపోయారు. అటువంటి అనుభవం లేని కనీసం బిపి ఎంత ఉంటుందో తెలియని వ్యక్తులు ల్యాబ్‌లో పనిచేస్తున్నారు. ఈ ల్యాబ్‌లకు సంబంధించి వైద్యులకు వాటాలు ఉండటం, ఆర్ఎంపిలకు వాటాలు ఉండడంతో అవసరం ఉన్నా లేకపోయినా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇది రోగుల పాలిట శాపంగా మారింది. పరీక్షలు నిర్వహించడం ద్వారా జబ్బుకు తగిన వైద్యం అందించవచ్చు కానీ అనవసర పరీక్షలు చేయడం ద్వారా రోగులను ఇబ్బందులు పెడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న అర్హత లేని సిబ్బంది ఉన్న ఆసుపత్రులు, ల్యాబ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ...**

వైద్య ఆరోగ్యశాఖ వ్యవహారం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది. ఆసుపత్రులు, ల్యాబ్‌లపై ఆరోపణలు వచ్చినప్పుడు ఒకటిరెండు ల్యాబ్‌పై దాడులు చేయడం మమ అని అనిపించి కేసులు లేకుండానే సరి చేసుకుంటున్నారు. ఆసుపత్రుల విషయంలోనూ ఇదే తంతు సాగుతుంది. ఇక ఆసుపత్రిలో వైద్యం వికటించి మరణాలు సంభవించినప్పుడు మా దృష్టికి రాకుండా మీరే చూసుకోండి అంటూ ఆసుపత్రి నిర్వాహకులకు ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఈ శృతి మించిన దోపిడీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఆస్తులు అమ్ముకున్నా వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని రోగులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# బీరోలులో మరో చోరీ

ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలంలో వరుస దొంగతనాలు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణవుతున్నాయి. గత మూడు సంవత్సరాలుగా మండలంలోని ఏదో ఒక గ్రామంలో చోరీలు, దోపిడిలు, గోలుసు అపహరణలు జరుగుతుండటంతో గ్రామీణ ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు భయాందోళనలకు గురవుతున్నారు. పిండిప్రోలు గ్రామానికి చెందిన చెన్న సుగుణమ్మ హత్య ఘటన ఇంకా ప్రజల మదిలో నుంచి చెరిగిపోక ముందే తాజాగా బీరోలు గ్రామంలో మరో దొంగతనం చోటు చేసుకుంది. గ్రామంలోని పాత ఆంధ్రా బ్యాంకు సమీపంలో నివాసముంటున్న వృద్ధ దంపతులు ఆవుల శకుంతల(75), భద్రయ్య(80) ఇంట్లో అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. సమాచారం ప్రకారం శకుంతల రాత్రి సుమారు 1.30గంటల సమయంలో బాత్రుంకు వెళ్లి తిరిగి ఇంట్లోకి వస్తుండగా ఇంటి వెనుక ద్వారం గుండా ప్రవేశించిన దుండగులు దంపతుల కళ్లల్లో కారం చల్లి శకుంతల మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితులు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నట్లు తెలిసింది. మూడు సంవత్సరాలుగా వరుస ఘటనలు మండలంలో గత కొన్నేళ్లుగా చోటుచేసుకున్న పలు దొంగతనాలు ప్రజల్లో భయాన్ని పెంచుతున్నాయి. తాళ్లచెర్వులో అత్తా కోడళ్ల మంగళసూత్రాలకు మెరుగు పెడతానని నమ్మబలికి ఇంట్లోకి ప్రవేశించిన వ్యక్తి వారి బంగారు గొలుసులు అపహరించిన ఘటన జరిగింది. కొండబాల బాబూరావు వ్యవసాయక్షేత్రంలో పనిచేస్తున్న సమయంలో దుండగులు కత్తులతో బెదిరించి మెడలోని మూడు తులాల బంగారు గొలుసు, ఉంగరాన్ని దోచుకెళ్లారు. పిండిప్రోలు గ్రామంలో వృద్ధురాలు ఆరెంపుల వెంకమ్మ నిద్రిస్తున్న సమయంలో ఆమెపై రాయితో దాడి చేసి మెడలోని బంగారు గొలుసును అపహరించాడు. అదే గ్రామంలో ఖమ్మం వరంగల్ జాతీయ రహదారి పక్కన ఉన్న మల్లెబోయిన యాదగిరి కిరాణా దుకాణంలోకి చొరబడి సుమారు పది తులాల బంగారం దొంగలించారు. అలాగే బస్టాండ్ సెంటర్‌లోని పూజలు శ్రీను ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఘటన కూడా చోటు చేసుకుంది. ఇవి మాత్రమే కాకుండా రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లు, పెట్రోల్ బంకుల్లో డీజిల్ చోరీలు, రోడ్డుపై నిలిపిన వాహనాల టైర్ల దొంగతనాలు, రైతుల ఇళ్ల వద్ద మేకలు, గొర్రెల అపహరణ వంటి అనేక ఘటనలు వరుసగా వెలుగుచూశాయి. రాత్రివేళలో గ్రామాల్లో పోలీసుల పెట్రోలింగ్ తగినస్థాయిలో లేకపోకపోవడం వల్ల దొంగలు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నిర్మానుష్య ప్రాంతాల్లోని ఇళ్లు, వృద్ధ దంపతులు, ఒంటరిగా నివసించే మహిళలనే లక్ష్యంగా చేసుకుని దొంగల ముఠా సంచరిస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో పోలీస్ నిఘాలను మరింత బలోపేతం చేసి రాత్రివేళలో క్రమం తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని, వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను త్వరగా గుర్తించి చట్టం ముందు నిలబెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే వరుస చోరీలకు అడ్డుకట్ట వేసి ప్రజల్లో భద్రతా భావం, పోలీసులపై విశ్వాసాన్ని పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ తన సిబ్బందితో వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అన్నపై తమ్ముడు దాడి

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ఆస్తి వివాదంలో అన్నపై తమ్ముడు దాడి చేసిన ఘటన గురువారం రఘునాథపాలెం మండలంలో చోటు చేసుకుంది. ఆస్తి వివాదం నేపథ్యంలో ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సొంత అన్నపై తమ్ముడు రాడ్డుతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తెలంగాణకు సింగరేణి ఆత్మలాంటిది

(మొదటిపేజీ తరువాయి)



కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం తరపున సింగరేణికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదని, 135 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సంస్థ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలతో సాగాలని భట్టి అన్నారు. మరో పదేళ్ల తర్వాత విద్యుత్ అవసరాలను అంచనా వేసి అందుకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. థర్మల్ విద్యుత్‌తో పాటు ప్రత్యామ్నాయ వినియోగాలపైనా దృష్టి పెట్టాలని, బొగ్గుతో పాటు ఇతర ఖనిజాల ఉత్పత్తి, విస్తరణపై దృష్టి సారిస్తే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.అంతకుముందు సింగరేణి జీఎం చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ తాడిచర్ల బ్లాక్ సింగరేణికి రావడంలో ఉప ముఖ్యమంత్రి చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జేవీఆర్ ఓసీ3 ప్రాజెక్టును కూడా సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జేవీఆర్ ఓసీ 124 లక్షల టన్నులు, కిష్టారం ఓసీ 28 లక్షల టన్నుల ఉత్పత్తితో 103 శాతం లక్ష్యాన్ని అధిగమించాయని తెలిపారు. భద్రతతో కూడిన ఉత్పత్తిలో కిష్టారం ఓసీ ఫైవ్ స్టార్, జేవీఆర్ ఓసీ ఫోర్ స్టార్ రేటింగ్‌లు సాధించాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, కిష్టారం సర్పంచ్ నరుకుళ్ల రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, టీఎస్ జెన్‌కో చైర్మన్ హరీష్, జిల్లా అటవీ శాఖ అధికారి అనూస్ అగర్వాల్, సింగరేణి జీఎం చింతల శ్రీనివాసరావు, వెల్ఫేర్ అధికారి కావ్యతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్‌జెడి కార్యాలయాన్ని వరంగల్‌కు తరలించాలి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కళాశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జెడి) కార్యాలయాన్ని వరంగల్‌కు తరలించాలని కోరుతూ తెలంగాణ గవర్నమెంట్ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టిజిసిజిటిఏ)ఖమ్మం జిల్లా అధ్యాపకులు, ఎంఎల్సీ శ్రీపాల్‌రెడ్డిని పిఆర్‌టియు కార్యాలయంలో గురువారం కలిసి కోరారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషికి టిజిసిజిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా॥ సురేందర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారని ఎంఎల్సీకి వివరించారు. తమకు మున్ముందు కూడా ఇదే సహకారాన్ని అందించాలని అధ్యాపకులు ఎంఎల్సీని కోరారు. ఎంఎల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌జెడి కార్యాలయాన్ని మార్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఎల్సీని అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సూరంపల్లి రాంబాబు, డా॥ పి.విజయ్‌కుమార్, డా॥ బి. శ్రీనివాస్, డా॥ కె. కార్తీక్, డా॥ సుజిత్‌రెడ్డి, పల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.



# రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**-ఎంఎల్సీ శ్రీపాల్‌రెడ్డి**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన, దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంఎల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రోటరీనగర్‌లోని రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో జిల్లా అధ్యక్షులు ఎం. సుబ్బయ్య అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎంఎల్సీ శ్రీపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్ల ప్రయోజనాల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుందని సరైన సమాచారాన్ని ముఖ్యమంత్రికి వివరించకపోవడం వల్ల జాప్యం జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. హెల్త్‌కార్డుల మంజూరులో అనేక తప్పులు జరిగాయని వాటిని సవరించడం కోసం ముఖ్యమంత్రితో మాట్లాడటం జరిగిందన్నారు. సమగ్ర ప్రయోజనాలు కలిగించే హెల్త్ కార్డులను వారం రోజుల్లోగా విడుదలయ్యేవిధంగా కృషి చేస్తామని ఉద్యోగ, పెన్షనర్ల పే రివిజన్ కమిషన్ రిపోర్టును ప్రకటించి అమలు కోసం కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఏలు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అవసరమైతే ఆందోళనకు కూడా సిద్ధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబాకుల వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షులు సీతారామయ్య, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, ఖమ్మం జిల్లా నాయకులు పూర్ణచందర్‌రావు, వెంకటనారాయణ, చెంచురెడ్డి, దుర్గాదేవి, జనార్ధన్, మోహినుద్దీన్,జానయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన మెచ్చా



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : ఈ నెల 24న తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా డాక్టర్ భూక్యా ఉదయజ్యోతి, ప్రసాద్, డాక్టర్ కాసాని నాగశేషపద్మ, చంద్రమోహన్ దంపతుల ఆధ్వర్యంలో మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని వైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు , మెచ్చా నాగేశ్వరరావులు ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి కేటీఆర్‌కు ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, దీని వల్ల అనేక మంది నిరుపేదలకు ఆర్థిక భారం తగ్గుతుందని, ఎంతోమందికి ఎంతగానో ఉపయోపడుతుందని అన్నారు. ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈకార్యక్రమంలో మహిపాల్, సీతారామస్వామి, రావు జోగేశ్వరరావు, జూపల్లి రమణరావు, మోహన్‌రెడ్డి, బీర్రం వెంకటేశ్వరరావు, సుంక ప్రసాద్, చిన్నశెట్టి నరసింహం, చందా లక్ష్మీ నర్సయ్య, గూడవర్తి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నారం రాజశేఖర్, సాధు జ్యోత్స్న సత్యవరపు సంపూర్ణ, రఘురాం, ఆరేపల్లి గోవింద్ మోటూరి మోహన్, పానుగంటి లక్ష్మణరావు, బోలికొండ చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు




**-బకాయిలు విడుదల చేయకపోతే రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం**
**-ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు పోరాటం**
**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి, ఉద్రిక్తత**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ విద్యార్థుల బోధన రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేండ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం మారిన పాలన మాత్రం అలానే ఉందన్నారు. విద్యార్థుల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేదన్నారు. బకాయిలు పెద్ద మొత్తంలో ఉండడంతో ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు పలుమార్లు నిరవధిక బంద్ నిర్వహించినా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదని విమర్శించారు. పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందన్నారు. ఐదేండ్లుగా పెండింగ్‌లోఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం పెండింగ్ బకాయిలు రూ.10,300 వేల కోట్లను విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు షేక్ నాగులమీరా, బుర్రా మనోజ్, సాయి, పవన్, అభిరామ్, వరుణ్, నాగశేషు, గోపి, నరేందర్, సుకుమార్, వెంకటేష్, మహేశ్వరి, పావని, గీత, సరస్వతి, మౌనిక, రమ్య పాల్గొన్నారు.

# కస్నాతండాలో వైరు దొంగల భీభత్సం

**- రూ.72వేల విలువగల 9మంది రైతుల వైర్లు చోరీ**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం కస్నాతండాలో వైరు దొంగలు మరోసారి రెచ్చిపోయారు. రాత్రి వేళలో వ్యవసాయ బోర్లకు అమర్చిన విద్యుత్ మీటర్ వైర్లను అపహరించి రైతులకు భారీ నష్టం కలిగించారు. ఈ ఘటన తొమ్మిది మంది రైతులకు చెందిన సుమారు రూ.72వేల విలువైన కరెంట్ మీటర్ వైర్లు చోరీకి గురయ్యాయి. బాధిత రైతులు అజ్మీరా హరిబాబు, దేవకొండ రామనాథ్, అవిరని వెంకన్న, అవిరని వెంకటేశ్వర్లు, అవరని వీరభద్రం, భూక్య నాధం, వలల లక్ష్మణ్ స్వామి, అవిరని నారాయణ, అవిరన నాగరాజులు ఆకేరు పరివాహక ప్రాంతంలో సాగు చేస్తున్నారు. పంటలకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లకు అమర్చిన మీటర్ వైర్లనే లక్ష్యంగా చేసుకుని దుండగులు చోరీకి పాల్పడ్డారని రైతులు వాపోయారు. ఆకేరు పరివాహక ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటం, రాత్రి వేళ్లలో ఎవరూ సంచరించకపోవడంతో దొంగలు ఈ ప్రాంతాన్ని అడ్డాగా మార్చుకున్నట్లు సమాచారం. వరుస ఘటనలతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ సీజన్‌లో ఇలాంటి చోరీలు రైతులకు తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో గస్తీని పెంచి, వైరు దొంగల ముఠాను వెంటనే పట్టుకొని చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

# రాహుల్‌గాంధీ అక్రమ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని కేంద్ర బిజెపి ప్రభుత్వం అక్రమంగా, అమానుషంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలతో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన ప్రత్యక్ష దాడి అని తీవ్రంగా ఖండించారు. దేశంలో పెరుగుతున్న అవినీతి వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే రాహుల్‌గాంధీపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజాసామ్య విలువలను కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని, అధికార అహంకారంతో వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్‌రెడ్డి, బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, సముద్రా పురషోత్తం, కడియం శ్రీనివాస్‌రావు, షేక్.ఇస్మాయిల్, గూడేటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగంలో విదేశీ పెట్టుబడులను వ్యతిరేకించాలి




**ప్రజాపక్షం/తల్లాడ:** వ్యవసాయ రంగంలో విదేశీ పెట్టుబడులను వ్యతిరేకించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహిస్తూ తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను నిరసిస్తూ సీపీఎం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని ఆరోపించారు. రైతులు పండిస్తున్న పత్తి, మిర్చి, ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని తెలిపారు. విదేశీ దేశాల్లో రైతులకు వివిధ రకాల సబ్సిడీలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ధరల హామీ వంటి సౌకర్యాలు ఉండటంతో వ్యవసాయం లాభదాయకంగా సాగుతుండగా, మన దేశ రైతులకు తగిన సబ్సిడీలు, గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ మద్దతు లేక వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడుతోందని అన్నారు. వ్యవసాయ రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించడం వల్ల దేశ ఆహారభద్రత, రైతుల స్వావలంభన దెబ్బతింటుందని పేర్కొన్నారు. అందుకుగాను కేంద్ర ప్రభుత్వం విదేశీ పెట్టుబడులకు సంబంధించిన నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకుని రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు చలమల విఠల్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, కల్యాణపు కృష్ణయ్య, సత్తెనపల్లి నరేశ్, చల్లా నాగేశ్వరరావు, పులి వెంకటనర్సయ్య, మన్నేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# రఘుపతిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన భట్టి



**ప్రజాపక్షం/తల్లాడ:** తల్లాడ పట్టణ వాస్తవ్యులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ దగ్గుల రఘుపతి రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్రమంలో విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క గురువారం వారి స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం దగ్గుల రఘుపతి రెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి, సతీమణి సరస్వతిని మృతికిగల కారణాలు అడిగి తెలుసుకుని తమ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాలు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన కట్టా ధర్మారావు కు రూ.14,000/ మడిపల్లి రమేష్ కి రూ.30,000/,బంధం మమతకి రూ.30,000/ విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను యూత్ కాంగ్రెస్ నాయకులు మడుపల్లి రాంప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, నాయకులు రామారావు, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కొమ్మిన్ని ప్రసాద్, మడిపల్లి కిరణ్ బాబు , రవికుమార్ , లబ్దిదారులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి



**ప్రజాపక్షం/చింతకాని :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యులైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ప్రధాని మోదీ నివాసం ముందు దర్నా చేస్తున్న వారిపై దాడికి నిరసనగా చింతకాని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు కొప్పుల గోవిందరావు, అబ్దుల్ నబీ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్, జోనల్ ఇంచార్జులు నాయకులు పాల్గొన్నారు.

# డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ముదిగొండ:** వర్షాకాల నేపథ్యంలో డెంగ్యూ, సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. ఇంటి పరిసరాలల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా వెంటనే సమీప ప్రభుత్వ అసుపత్రిని సంప్రదించి వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని సూచించారు. మండలంలోని ఆర్‌ఎంపీలు, ముందుల దుకాణాల నిర్వాహకులు బయోమెడికల్ వ్యర్థాలను ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనల ప్రకారమే నిర్వహించాలని హెచ్చరించారు. బయోమెడికల్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం లేదా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/ముదిగొండ:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాల నేపథ్యంలో కరువు పరిస్థితుతులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని పలు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ముదిగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీఓ విజయ మాట్లాడుతూ..ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యాన్మాయ పంటలసాగుపై దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీఓ రామకృష్ణ, పశువైద్యాధికారి అశోక్, సర్పంచి కట్టకూరి ఉపేందర్, ఉపసర్పంచి పార్వతి, ఏఈఓ వాసంతి, జీపీఓ నరేశ్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐఎస్‌బీ పరిశోధకుల క్షేత్రస్థాయి అధ్యయనం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** బెండాలపాడు గ్రామ పంచాయితీలో ఐఎస్‌బీ హైదరాబాద్ పరిశోధక బృందం గ్రామీణ జీవన విధానం, గిరిజనుల జీవనశైలిపై క్షేత్రస్థాయి అధ్యయనం నిర్వహించింది. స్థానిక సర్పంచ్, గ్రామస్తుల సహకారంతో గ్రామానికి సంబంధించిన వివరాలను సేకరించిన బృందం అనంతరం ఎర్రబోడు ప్రాంతాన్ని సందర్శించి గొత్తికోయ గిరిజనులను కలిసి వారి జీవన విధానం, ముఖ్యంగా పోడు వ్యవసాయ విస్తరణ, అభివృద్ధి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఐఎస్‌బీ రిసెర్చ్ ప్రతినిధి ఫణి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, కాంగ్రెస్ నాయకుడు మల్లం కృష్ణయ్య, వార్డు సభ్యుడు తేజావత్ బాబు, తిప్పనపల్లి సర్పంచ్ ధారావత్ రామారావు, లక్ష్మీదేవిపల్లి సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్ పోడియం నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలు సాగు లాభదాయకం



**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య సూచించారు. కిష్టాపురం గ్రామంలో నిర్వహించిన రైతుల అవగాహన లో ఆయన మాట్లాడుతూ మండలంలో సాధారణం కంటే 56శాతం తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో పెసర, కంది, జొన్న, ఆముదం వంటి తక్కువ నీటితో పండే పంటల ను సాగు చేయాలని తెలిపారు. అలాగే వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సైదులు, మండల వ్యవసాయ అధికారి వాణి, వ్యవసాయ విస్తరణ అధికారి జానీ పాల్గొన్నారు.

## మోడీ దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని నిరసిస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కారేపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో పేరుపల్లి గ్రామంలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి వై ప్రకాశ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, వై జానకి, అలెం గురువయ్య, చంద్రయ్య, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, సంపత్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/కారేపల్లి:** యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్, అజ్మీర చరణ్ జన్మదినం సందర్భంగా అజ్మీర భద్రమ్మ, గణేష్ దంపతుల ఆధ్వర్యంలో భాగ్యనగర్ తండా సబ్ హెల్త్ సెంటర్‌లో తలసేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గుగులోత్ హర్ష నాయక్ మాట్లాడుతూ రక్తదానం ద్వారా తలసేమియా చిన్నారులకు ప్రాణదానం చేసే అవకాశం లభిస్తుందని, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి పెంట్రా అనిల్ కుమార్, డాక్టర్ సిద్ధార్థ, క్యాంపు నిర్వాహకుడు నరేష్, ఏఎన్ఎంలు గుగులోత్ నీలాబాబు, కృష్ణవేణి, వార్డు సభ్యురాలు గుగులోత్ జ్యోతిరాములు, మాజీ వార్డు సభ్యుడు గుగులోత్ రవినాయక్, నాయకులు బానోత్ రాందాస్ నాయక్, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ రాజేష్ నాయక్, ఆశా కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

## సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాకా బంధీ



**ప్రజాపక్షం/సుజాతనగర్:** కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు సుజాత నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ రమాదేవి ఆధ్వర్యంలో పోలీసులు నాకా బంధీ తనిఖీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలు, హెల్మెట్, సీట్ బెల్ట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులపై మోటార్ వెహికల్ (ఎంవి) యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్, ఏఎస్ఐలు సత్యం, శివాజీ గణేష్, హెచ్‌సీలు నరసింహారావు, రవి, పీసీలు బాబు, మహేష్, నాగరాజు, బాలకృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## కాంతమ్మ సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/ఇల్లందు:** సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పోలారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకురాలు ధారావత్ కాంతమ్మ సంతాప సభ నిర్వహించారు. సభలో ఇల్లందు మండల కార్యదర్శి యాదలపల్లి సత్యం, పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మోతిలాల్, మండల కమిటీ సభ్యుడు దారావత్ రవి మాట్లాడుతూ కాంతమ్మ దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా, భూ హక్కులు, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. ఉద్యమ కార్యకర్తలకు ఆశ్రయం కల్పించడం, నాటు సారా వ్యతిరేక ఉద్యమం, పోడు భూముల పరిరక్షణ, గ్రామీణ మహిళలకు సేవలు అందించడం వంటి రంగాల్లో ఆమె చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ సభకు మండల కమిటీ సభ్యుడు మంగ్యా అధ్యక్షత వహించగా, మాజీ సర్పంచ్ సొరట్, హార్జ్య, రమేష్, లక్ష్మ, పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొని కాంతమ్మకు నివాళులర్పించారు.

# సహజ ప్రసవాలపై మాటలు.. సిజేరియన్లపై చేతలు..!

**ఇది మాతాశిశు ఆరోగ్య కేంద్రం దుస్థితి**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాల ప్రోత్సహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదే పదే ఆదేశాలు జారీ చేస్తున్నా.. ఖమ్మం ప్రభుత్వ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. గర్భిణులకు సాధ్యమైనంత వరకు సహజ ప్రసవాలు చేయాల్సిన చోట, అధిక సంఖ్యలో సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతుండం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో జరిగే మొత్తం ప్రసవాల్లో దాదాపు ప్రసవాలు ఖమ్మం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోనే నమోదువుతున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొత్తం 14,133 ప్రసవాలు జరగగా, వాటిలో 12,605 ప్రసవాలు ఖమ్మం ప్రభుత్వ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోనే జరిగాయి. ఆశ్చర్యకరంగా వీటిలో 58 శాతం సిజేరియన్ ప్రసవాలే కావడం ఆందోళనకు గురిచేస్తోంది. వైద్యపరంగా అవసరమైతే మాత్రమే సిజేరియన్ చేయాలని మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, ఇంత అధిక శాతం ఆపరేషన్లు జరగడం వెనుక కారణాలపై ఆరోగ్యశాఖ సమీక్ష చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజారోగ్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తల్లి, శిశువు ఆరోగ్య పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, సహజ ప్రసవాల శాతాన్ని పెంచే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి

**- విద్యార్థులపై లాఠీ ఛార్జీ అమానుషం**
**- దేశ యువతకు కేంద్రప్రభుత్వం క్షేమాపణ చెప్పాలి**
**- విద్యార్థుల అరెస్టులు అప్రజాస్వామికం**
**- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జీని ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన అక్రమ నిర్బంధాలు దమనకాండకు నిరసనగా గురువారం రామవరంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా నిరసన తెలపడం విద్యార్థుల హక్కని దానిని అణిచివేసేలా బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకోవడం మోది ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. ఎన్‌డిఏ అవినీతి వరుస పరీక్షా కుంభకోణాల వల్ల 17 మంది నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందన్నారు. దేశభవిష్యత్‌ను నిర్మించే విద్యార్థులను నేరస్తులుగా చూడటం మానకోవాలని నిరసన హక్కులను కాలరాసే చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి అరెస్టు చేసిన వారిని భేషరుత్తుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లాఠీఛార్జీలకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలతో తక్షణమే చర్యలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఖయ్యూమ్ జావీద్ కొచ్చర్ల రాకేష్ రసూల్ ప్రసాద్ కొయ్యడి రవి శివ బాబా యాకూబ్ పాషా చిన్ను బాలు చంటి సతీష్ వంశీ ఇస్మాయేల్ శేఖర్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి పైపుల లీకులతో రోడ్లన్నీ బురదమయం..!

**-చిన్నపోచారం, పెద్దపోచారం గ్రామాల్లో ప్రజల అవస్థలు**
**-వ్యాధులు ప్రబలే ప్రమాదం, పట్టించుకోని అధికారులు**




**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని చిన్నపోచారం, పెద్దపోచారం గ్రామాల్లో మంచినీటి సరఫరా పైపులు అనేక చోట్ల లీకవుతుండటంతో గ్రామ బజార్లు బురదమయంగా మారాయి. ప్రధాన రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పైపులు నుంచి నిరంతరం నీరు వృథాగా పారుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బజార్లలో నడవాలంటేనే ప్రజలు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పైపుల లీకేజీల కారణంగా రహదారులపై నిల్వ నీరు చేరి బురద ఏర్పడుతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు జరిపడే ప్రమాదం ఉండగా, పాదచారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు ప్రతి రోజూ ఈ సమస్యతో సతమతమవుతున్నారు. కొన్ని చోట్ల నిల్వ నీటి వల్ల దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా నిల్వ నీరు దోమల పెరుగుదలకు కారణమవుతుందని, డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. మంచినీటి పైపుల లీకేజీల వల్ల విలువైన తాగునీరు కూడా వృథా అవుతుండటం గమనార్హం. సమస్యలపై పలు మార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్న ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, లీకేజీలను మరమ్మతు చేయడంతో పాటు బురద తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన మంచినీటి వ్యవస్థను నిర్వహించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వ్యాధులు ప్రబలిన తర్వాతే స్పందిస్తారా అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పంచాయితీ కార్యదర్శి రాంబాబు వివరణ.....**

గ్రామంలో మంచినీటి పైపులు ప్లాస్టిక్, ఐరన్ పైపులకు జాయింట్ ఇవ్వడం వల్ల లీకైపోతున్న మాట నిజమే, మరో చోట గేట్ వాల్ నుంచి కూడా లీక్ అవుతున్నాయి. వాటిని సర్పంచితో కలిసి త్వరలోనే మరమ్మతులు చేస్తామన్నారు. ఇంకా రోడ్లపై ఆగే నీటి నిలువలో విషయమై త్వరలో జెసిబితో రోడ్లకు మట్టి పోపిస్తామని, సైడ్ మట్టి కూడా తొవ్వుతామని తెలిపారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి

**ప్రజాపక్షం/మధిర:** మడుపల్లిలోని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 8 మంది విద్యార్థులకు ధాతల సహకారంతో నగదు పురస్కారాలు అందజేయడం జరిగింది. విద్యార్థులంతా ఎంతో ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని, అహర్నిశలు వాటి కోసం రాజీ లేని పోరాటం చేసి తమ కలల సాకారం చేసుకోవాలని మధిర మున్సిపల్ కమీషనర్ శామ్యూల్ పాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ శామ్యూల్ పాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నర్సింహారావు, పంగా శేషగిరి, వార్డు కౌన్సిలర్లు పిల్లి సునీత, వేమిరెడ్డి లక్ష్మీ తులసి, శ్రీశైలం నర్సిరెడ్డి, పిల్లి మోజస్, రేగండ్ల సాంబశివరావు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వానికి పతనం తప్పదు



**- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కే షాహిద్, అవరక అజిత్**
**- కలెక్టరేట్ ముట్టడి విజయవంతం**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కే షాహిత్, వరక అజిత్ విమర్శించారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ విద్యను బలహీన పరిచే విధానాలను కొనసాగిస్తే విద్యార్థుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సివస్తుందని, విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వం పతనం కాక తప్పదన్నారు. విదా రంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి విజయవంతమైంది. వేలాది మంది విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఒకానొక దశలో కలెక్టరేట్ ముఖ ద్వార గేటును తోసుకుంటూ లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జెండాలు పట్టుకుని గేట్లు ఎక్కి పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి షాబిద్,అజిత్‌లు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ రోజురోజుకీ సంక్షోభంలోకి నెట్టబడుతోందని, ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు లేక విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెంటనే పూర్తి స్థాయి విద్యాశాఖామంత్రిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యారంగానికి దిశానిర్దేశం చేసే నాయకత్వం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూళ్లు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితిని అరికట్టేందుకు రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఫీజులపై ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ వారు చేశారు. అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయింపు చేయాలన్నారు. ప్రతీ విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యతని పేర్కొన్నారు. విద్యార్థి సమస్యలు పరిష్కరించేంత వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగుతాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అజిత్ డిమాండ్ వారు చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏఓ కృష్ణ ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు ఇనపల్లి పవన్‌సాయి, గుండాల సుజన్, మాణిక్యాల వినయ్, గుగులోత్ వంశీ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు కొరిమి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**-ఎంఎల్ఏ జారే ఆదినారాయణ**




**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండలంలో ఎంఎల్ఏ జారే ఆదినారాయణ విస్తృతంగా పర్యటించి పలు సంక్షేమ, విద్యా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గండుగులపల్లిలో అర్హులైన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్)చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం దురదపాడు గ్రామానికి చెందిన సున్నం ఈశ్వర్ మృతికి సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాచారం ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన తెలంగాణ ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఏ, ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజా సంక్షేమం, విద్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఎంఈవో, విద్యాశాఖ అధికారులు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో పాగింగ్ మిషన్ల మాయాజాలం..?

**-కొత్తవి కొనుగోలు...పాతవి ఏమయ్యాయి?**
**గురులింగం కొనుగోలు చేసిన పాగింగ్ మిషన్లు ఎక్కడ?**
**-ప్రజాధనంపై వృథాపై ప్రశ్నల వర్షం**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో పాగింగ్ మిషన్ల కొనుగోలు వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దోమల నివారణ కోసం ప్రతి ఏడాది కొత్త పాగింగ్ మిషన్లు కొనుగోలు చేస్తున్నప్పటికీ, గతంలో కొనుగోలు చేసిన మిషన్లు ఏమయ్యాయనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం మాజీ కమీషనర్ చింతా వేణు హయాంలో పాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. అనంతరం కమీషనర్ గురులింగం బాధ్యతలు నిర్వహించిన సమయంలో మరో నాలుగు పాగింగ్ మిషన్లు కొనుగోలు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. అయితే ఇటీవల బాధ్యతలు చేపట్టిన కమీషనర్ రామచంద్రరావు, మున్సిపాలిటీలో పాగింగ్ మిషన్లు అందుబాటులో లేవనే కారణంతో ఐదు కొత్త మిషన్లను కొనుగోలు చేశారు. దీంతో గతంలో కొనుగోలు చేసిన మిషన్లు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి? అని పనిచేయడం లేదా? మరమ్మత్తులు చేయలేని స్థితిలో ఉన్నాయా? లేక రికార్డులకే పరిమితమయ్యాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీలో ఒకే పనికోసం వరుసగా కొత్త మిషన్లు కొనుగోలు చేయడం వెనుక అసలు కారణం ఏమిటన్నది ప్రజలు ప్రశ్నిస్తున్నరు. పాత మిషన్లకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్, వినియోగ వివరాలు, మరమ్మత్తుల రికార్డులు, కొనుగోలు బిల్లులు ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు. ప్రజాధనంతో కొనుగోలు చేసిన పరికరాలు కనుమరుగైతే దానికి బాధ్యత ఎవరిది? అధికారులు మారిన ప్రతిసారి కొత్త పాగింగ్ మిషన్లు కొనుగోలు చేయడం పరిపాటిగా మారిందా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వైరా మున్సిపాలిటీలో పాగింగ్ మిషన్ల కొనుగోళ్లపై సమగ్ర విచారణ జరిపి గతంలో కొనుగోలు చేసిన మిషన్ల ప్రస్తుత పరిస్థితి, వాటి వినియోగం, బాధ్యులపై చర్యల విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.




**పాగింగ్ మిషన్లు లేకపోవడంతో కొత్తగా ఐదు కొనుగోలు చేశాం : కమీషనర్ రామచంద్రరావు**

వైరా మున్సిపాలిటీలో పాగింగ్ మిషన్లు అందుబాటులో లేకపోవడంతో కొత్తగా ఐదు పాగింగ్ మిషన్లను కొనుగోలు చేసినట్లు మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు తెలిపారు. తాను కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి వార్డులో పాగింగ్ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అయితే అప్పటికి వినియోగానికి అనువైన పాగింగ్ మిషన్లు లేకపోవడంతో కొత్తగా ఐదు మిషన్లను కొనుఓగులు చేసినట్లు వివరించారు. అలాగే పాత పాగింగ్ మిషన్‌లలో మూడు మున్సిపాలిటీ స్టోర్‌రూమ్‌లో ఉన్నాయని, అవి పూర్తిగా పనిచేయని స్థితిలో ఉన్నాయని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణ, దోమల నివారణ చర్యలను దృష్టిలో ఉంచుకొని కొత్త మిషన్ల కొనుగోలు నిర్ణయం తీసుకున్నామని కమీషనర్ రామచంద్రరావు పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అవసరానికి అనుగుణంగా పాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ, రహదారిపై బైఠాయింపు నిర్వహించారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు రమణ మాట్లాడుతూ నీట్ ప్రశ్నా పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై నిరసన తెలిపిన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు భోజ్యా నాయక్, సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, గుగులోతు బాబు, రామారావు, ఉప సర్పంచ్ కాశి, తుమ్మలపల్లి సురేష్, బొర్రా సురేష్, ఫజల్, బగ్స్ సంపత్, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ అక్రమాలను అరెస్టులతో దాచలేదు



**ప్రజాపక్షం/దమ్మపేట:** నీట్ సహా పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై నిరసన తెలిపిన విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులపై చర్యలను ఖండిస్తూ దమ్మపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎంఎల్ఏ జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం, కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రయింఆక గాంధీలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో నాయకులు కక్కిరాల రమేష్, కాక రమేష్, పగడాల రమాదేవి, రాంబాబు, చిట్టిబాబు, చీకటి శ్రీనివాసరావు, మద్దిశెట్టి సత్యప్రసాద్, పాదిలి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## సహస్రలింగ క్షేత్రంలో ఎంఎల్ఏ తెల్లం పూజలు




**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలం నర్సాపురం గ్రామంలోని శ్రీ చిన్న అరుణాచలం శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం( సహస్రలింగం)లో నిర్వహించి ప్రత్యేక పూజల్లో భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ శాంతులు, సుభిక్షాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో భద్రాచలం మార్కెట కమిటీ ఛైర్మన్ తెల్లం సీతమ్మ, దుమ్ముగూడెం తహసీల్దార్ అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్లం హరిబాబు, నాయకులు లంక అబ్బులు, అన్నెం సత్యనారాయణమూర్తి(సత్యాలు), దర్శి సాంబశివరావు, పూజారి సూరిబాబు, వీరమాచినేని సునీల్, కొర్స శివరామకృష్ణ, రాజు, శ్రీనివాసాచారి, వార్డు సభ్యుడు శ్రీకాంత్, యూత్ నాయకులు బొల్లి శేఖర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీ భవనాల ప్రారంభం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలంలోని డబ్ల్యూఎల్ రేగుబల్లి, నడికుడి గ్రామాల్లో సుమారు రూ 20లక్షల చొప్పున నిర్మించిన రెండు నూతన గ్రామ పంచాయితీ భవనాలను భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నూతన భవనాల ద్వారా గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయన్నారు. నడికుడి గ్రామ పంచాయితీ భవనం నిర్మాణానికి స్థలదానం చేసిన కొడాలి ప్రశాంత్ కుమార్ జ్ఞాపకార్థం కొడాలి లోకేష్‌ను ఎంఎల్ఏ అభినందించారు. ఈకార్యక్రమాల్లో భద్రాచలం మార్కెట్ కమిటీ ఛైర్మన్ తెల్లం సీతమ్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్లం హరిబాబు, నడికుడి సర్పంచ్ జగిడి పాలమ్మ, డబ్ల్యూఎల్ రేగుబల్లి సర్పంచ్ పూనెం విజయకుమారి, ఉప సర్పంచ్ ఎస్‌కే ఖాదర్ పాషా పాల్గొన్నారు.

## చిరుధాన్యాలు పంటలను సాగు చేసుకోవాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి, అష్టగుర్తి, దాచాపురం, సిరిపురం(కెజి) గ్రామాల్లో మండల, గ్రామ స్థాయి అధికారులు ఎల్‌నినోపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ మాట్లాడుతూ రైతులు వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని అపరాలు, చిరు ధాన్యాలు పంటలు వేయడానికి సిద్ధకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపివో అనురాధ, హెచ్‌పివో, ఏఐవోలు వెంపటి కీర్తి, పరిటాల వెంకటనర్సయ్య, మేడా రాజేష్, చామకూరి యశ్వంత్, పంచాయతీ సెక్రటరీలు, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని, అష్టగుర్తి సర్పంచ్ కంచర్ల అనిత, దాచాపురం సర్పంచ్ గూడూరు వెంకట్రావమ్మ, సిరిపురం(కెజి) సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, రైతులు జవ్వాజి వెంకటేశ్వరరావు, బండి కోటయ్య, చిండి వెంకటేశ్వర రావు, నల్లమోతు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడిలేకుండా పటిష్ట చర్యలు

**ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితులవల్ల ఖమ్మం జిల్లా ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. మండల పరిదిలోని తనికెళ్ల లోగల ఎన్నెస్పీ లాకులవద్దకు చేరుతున్న గోదావరి జలాలను గురువారం భటివిక్రమార్క స్వయంగా క్షేత్రస్థాయిలో వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సీపీ సునీలదత్ తో కలిసి పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించారు. గోదావరి జలాలు ఎన్ని టిఎంసీలు వస్తున్నాయి? కెనాల్ పరిదిలో ఎన్ని చెరువులు ఉన్నాయి? ఎన్నెస్పీ కెనాల్ పరిదిలో ఉన్న చెరువులు నింపేందుకు అధికారులు కృషిచేయాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులకనుగుణంగా ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. తొలుత తనికెళ్ల గ్రామ సర్పంచ్ గడల కళావతి భట్టిని శాలువాలతో ఘనంగా సన్మానించి బొకేను అందించారు. గ్రామానికి సంబందించిన పలు సమస్యలపై ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో వివెంకటాయపాలెం సర్పంచ్ కాపా ఆదినారాయణ, బోడియాతండా సర్పంచ్ వడ్తియా భద్రకాళి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఇరిగేషన్ శాఖ ఎఈ వంకటేశ్వర్లు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ యరగర్ల హనుమంతురావు, రాష్ట్ర హస్తకళల సంస్థ మాజీ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కొణిజర్ల తహశీల్దార్ నారపోగు అరుణ, ఆర్‌ఐ నరేష్, కాంగ్రేస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, తనికెళ్ల ఉపసర్పంచ్ చల్లా నరసింహారావు,పలుశాఖలఅధికారులు పాల్గొన్నారు.

# జల సంరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

**డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ**




**ప్రజాపక్షం/వైరా:** వాతావరణ మార్పులు, తగ్గుతున్న భూగర్భ జలాల మట్టాలు, పెరుగుతున్న తాగునీటి అవసరాల నేపధ్యంలో నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల సంచయ్ జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో కలిసి నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించి వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాలను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం భూగర్భ జలాల మట్టాలు ఆందోళనకరంగా తగ్గుతున్నాయని, భవిష్యత్తులో నీటి కొరత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కోవాలంటే ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమని తెలిపారు. అందకే జల సంచయ్ జన భాగిదారి కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబ, ప్రతి కాలనీ, ప్రతి వార్డు నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని వృధా కాకుండా భూమిలోకి ఇంకించేలా రూఫ్‌టాప్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం, బోర్‌వెల్ రీచార్జ్ షాఫ్టులు నిర్మించడం, చెరువులు, కుంటలు, కాల్వలను పరిరక్షంచడం, నీటి నిల్వ సామర్ధ్యాన్ని పెంచే చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలాల పునరుత్పత్తి సాధ్యమవుతుందని వివరించారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు ఇంటి స్థాయిలోనే నీటి సంరక్షణ పద్ధతులను అలవరచుకోవాలని సూచించారు. నేడు కాపాడిన ప్రతి నీటి బొట్టు రేపటి తరాలకు జీవనాధారంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, సుధీర్, వెంకట్రావు, ఫాతిమా, పలువురు మున్సిపాలిటీ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఉద్యోగులకు రూ.1 కోటి ప్రమాద బీమా వర్తింపు

**ఏఐటీయూసీ కృషితో కీలక నిర్ణయం**
**వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్**





**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సింగరేణి సంస్థ పరిధిలోని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా కార్పోరేట్ సాలరీ అకౌంట్ ద్వారా లభించే రూ.1 కోటి ప్రమాద బీమా (యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ కవర్) వర్తించేలా సంబంధిత బ్యాంకులు అంగీకరించినట్లు ఏఐటీయూసీ సింటరేణి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ గురువారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పోరేట్ సాలరీ అకౌంట్ కలిగిన ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణించిన పక్షంలో సంబంధిత నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యులకు రూ.1 కోటి ప్రమాద బీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఉద్యోగులకు ఆర్థిక భద్రత పెరగడంతోపాటు, వారి కుటుంబాలకు అత్యవసర సమయంలో గణనీయమైన ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. అలాగే, సింగరేణి సూపర్ బజార్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఇదే తరహా రూ.1 కోటి ప్రమాద బీమా సౌకర్యం వర్తించేలా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యం, సంబంధిత బ్యాంకులతో చర్చలు కొనసాగిస్తూ కృషి చేస్తోందని వెల్లడించారు. సింగరేణి సంస్థ పరిధిలోని ప్రతి ఉద్యోగికి సమాన సంక్షేమ సౌకర్యాలు, భద్రతా పరిరక్షణ, ఆర్థిక రక్షణ కల్పించడమే ఏఐటీయూసీ లక్ష్యమని పేర్కొంటూ, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

**జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్.కె.రాజశేఖర్ గౌడ్**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కార్పోరేట్ స్థాయిలో ప్రభుత్వ హస్పిటల్ లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్ గౌడ్ పేర్కోన్నారు. మండల కేంద్రం లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను గురువారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. రోగుల వద్దకు వెళ్లి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశం ను నిర్వహించారు. వారికి వివిధ అంశాల పై పలు సూచనలు చేశారు. హస్పిటల్ కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, యువజన రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజని, సోమనబోయిన సాయి నవీన్, కడియాల నరేష్ లు ఆయన ను కలిసి పలు సమస్యల పై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 28న నేలకొండపల్లి లో నిర్వహించనున్న రక్తదాన శిభిరం ను విజయవంతం చేయాలని కోరారు. శిభిరం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మంగళ తదితరులు పాల్గొన్నారు.

# 28న రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/వైరా:** ఈ నెల28న కొణిజర్ల—వైరా మండలాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు పిలుపునిచ్చారు. వైరా పార్టీ కార్యాలయంలో బండారుపల్లి ముత్తయ్య అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల్లో రాజకీయ అవగాహన, సిద్ధాంతపరమైన చైతన్యం పెంపొందించడంలో ఈ శిక్షణ తరగతులు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. పార్టీ బలోపేతానికి, సమర్ధవంతమైన ప్రజా ఉద్యమాల నిర్వహణకు రాజకీయ శిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. వైరా మండలంలోని సిపిఐ నాయకులు, కార్యకర్తలు అందరూ తప్పనిసరిగా ఈ శిక్షణ తరగతులకు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి మూట కొండ, కొండా రామకృష్ణ, గారపాటి అశోక్, కోట నాగేశ్వరరావు, అప్పం సుధాకర్, దాసరి హరీష్, దారా వెంకటేశ్వర్లు, చింతమాల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్లుగా ఒక్కరోజు సెలవు లేకుండా ఉపాధ్యాయ విధులు

**బానోతు రాము సేవలకు ప్రశంసలు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం ఖానాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బానోతు రాము తన క్రమశిక్షణ, విధి నిర్వహణ, సామాజిక స్పృహతో ప్రత్యేక గుర్తింపు పొందారు. మండలంలోని ఉపాధ్యాయుల్లో ఆదర్శ ఉపాధ్యాయుడిగా పేరు సంపాదించుకున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రతిరోజు పాఠశాలకు హాజరై విద్యార్థులకు బోధన అందించడం ఆయన సేవా తత్వానికి నిదర్శనం. ఇంట్లో అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రులు ఉన్నప్పటికీ పాఠశాల విధులు పూర్తయ్యాకే వారిని ఆసుపత్రికి తీసుకెళ్లడం ద్వారా తన బాధ్యత పట్ల ఉన్న అంకితభావాని చాటుతున్నారు. 2008 ఫిబ్రవరిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరిన బానోతు రాము, సింగరాయపాలెం, దాచాపురం తదితర గ్రామాల్లో పనిచేస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా గ్రామ ప్రజలు, తల్లిదండ్రుల విశ్వాసాన్ని కూడా సంపాదించారు. విద్యార్థుల పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత, విధి పట్ల నిబద్ధతతో ముందుకు సాగుతున్న బానోతు రాము వంటి ఉపాధ్యాయుఉ విద్యా వ్యవస్థకు ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు.

# గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/మధిర:** మధిర పట్టణంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా, విక్రయాలను అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ కమీషనర్ సునీల్ దత్ ఆదేశబూల మేరకు వైరా ఏసిపి సాంరగపాణి ఆధ్వర్యంలో మధిర టౌన్ సిఐ డి.రమేష్, ఎస్సైలు కిషోర్ కుమార్, నవిత, మధిర టౌన్ పోలీసులు గురువారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, స్థానిక హోటళ్లు, పాఠశాలల, కళాశాలల ఆవరణలో ఉన్నటువంటి పాన్‌షాప్, టీ కొట్టు, కొరియర్ సర్వీస్ స్టాక్ పాయింట్స్ అయిన అమెజాన్, ఫ్లిప్కార్ట్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐడి రమేష్ మాట్లాడుతూ మధిర పరిధిలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేసినా, అమ్మకాలు జరిపినా, రవాణా చేసినా చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఖమ్మం నుంచి వచ్చిన స్పెషల్ నార్కోటిక్ డాగ్, పింకి, డాగ్ హ్యాండ్లర్ రవి బృందంతో పాటు, మధిర టౌన్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/మధిర:** ఢిల్లీలో కాంగ్రేస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధిని కేంద్ర బిజెపి ప్రభుత్వం అక్రమంగా అమానుషంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ మధిరలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

# విద్యార్థుల లక్ష్యాల కృషి చేయాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రతీ విద్యార్థి రోజుకు 1 గంట నేర్చుకోవటం అలవాటు చేసుకోవాలని జిల్లా రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమం ను యంఈవో చలపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ కోసం రోజుకు తప్పనిసరిగా ఒక గంట రిమీడియేషన్ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. 1 నుంచి 5 వ తరగతి విద్యార్థులకు ప్రతీ రోజు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు తప్పకుండా విద్యార్థులకు అలవాటులు నేర్చుకోవాలని సూచించారు. వెనకబడిన విద్యార్థులకోసం ప్రత్యేక బోధన ద్వారా వారిలో ప్రతిభ చూపే విధంగా లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రతీ రోజు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతి రావు, ఆర్పీఎస్ మాధవ్, స్వామి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమేష్, టి.వెంగళరావు, తొర్తి సురేష్,మారగాని సత్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటుహక్కుపై సిపిఐ విస్తృత ప్రచారం

**- ఎస్ఐఆర్ ప్రక్రియపై గడపగడపకు అవగాహన**
**- ప్రతీ అర్హులకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**
**- ఎస్‌కె సాబీర్ పాషా**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రయపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా తెలిపారు. కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన బస్తీలు, గ్రామాల్లో 5 ప్రచార ఆటోల ద్వారా మైకు ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో ఓటుహక్కు అత్యంత విలువైందని ఓటరు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్‌లో హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను సరైన వివరాలతో నింపి తిరిగి ఎన్నికల అధికారులకు అందించే బాధ్యతను ప్రతీ పౌరుడూ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాటిని సరిగా సమర్పించకుంటే ఎదురయ్యే నష్టాలను, ప్రక్రియ షెడ్యూల్‌లో విశేషాలను మైకుల ద్వారా వీధి వీధినా వివరిస్తున్నట్లు తెలిపారు. ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా పెట్టుకుని పార్టీ పనిచేస్తుందన్నారు. స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రాతినిధ్య నియోజకవర్గంలో అన్ని రంగాల్లోనూ శీఘ్రగతిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్లు, డ్రైన్లు, వంతెనల నిర్మాణం సంక్షేమ పథకాలు, నిధుల సేకరణ ద్వారా నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందన్నారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలు భాగస్వామ్యం ఓటుహక్కు నమోదు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు నియోజకవర్గ వ్యాప్తంగా తమ పార్టీ ప్రచారాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో ప్రత్యేక నాకాబందీ

**- 3714 వాహనాల తనిఖీ, 764 స్పాట్ చలానాలు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో ఏకకాలంలో పోలీసులు గురువారం ప్రత్యేక నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, గంజాయి అక్రమరవాణా ఆరికట్టేందుకు రోడ్డు భద్రతా లక్ష్యంగా వాహనాలు తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, ఫింగర్ ప్రింట్ డివైస్‌తో పాత నేరస్తుల గుర్తింపు చేపట్టారు. ఈ తనిఖీల్లో మొత్తం 3714 వాహనాలను పరిశీలించగా 510 మంది లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం, 524 మంది హెల్మెట్ లేకుండా, 106 మంది సీటుబెల్టు లేకుండా ప్రయాణించడం, 14 మంది మైనర్లు వాహనాలు నడపడంతో పాటు 7 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. 764 మందికి స్పాట్ చలాన్లు విధించి 1567 వాహనాల నుండి జరిమానాలు వసూళ్లు చేశారు. అదేవిధంగా చోరీకి గురైన ఒక ద్విచక్ర వాహనాన్ని గుర్తించి స్వాదీనం చేసుకున్నారు. అదే విధంగా 15 అనుమతి లేని వాహనాలు, 7 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్టు తప్పని సరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఈ సందర్భంగా ఎస్‌పి రోహిత్ రాజ్ సూచించారు. జిల్లాలో ఇలాంటి ప్రత్యేక తనిఖీలు ఇక నుండి నిరంతరాయంగా కొనసాగుతాయని చెప్పారు.

# ఉప ముఖ్యమంత్రి భట్టి పర్యటనను విజయవంతం చేయండి

**పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపు**



**ప్రజాపక్షం/మణుగూరుః** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక మరియు విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేడు (శుక్రవారం) పినపాక నియోజకవర్గంలోని మణుగూరులో పర్యటించనున్న నేపథ్యంలో, నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా బీటీపీఎస్‌లో టీజీ జెన్‌కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీఏవీ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించడం, అనంతరం సింగరేణి ఓపెన్ కాస్ట్ మరియు అండర్‌గ్రౌండ్ గనులను పరిశీలించడం, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, భవిష్యత్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పర్యటన పినపాక నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

# ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న బిజెపి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తున్నారని శాంతియుత నిరసన తెలిపిన కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టులు అప్రజాస్వామికమని, రాహుల్ గాంధీ అరెస్టులను ఖండిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గొంతు నొక్కే కుట్రలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పడగ సమ్మయ్య, సర్పంచులు వాసం సుష్మిత, చంద్రశేఖరర్, కృష్ణ, సత్యనారాయణ, వెంకన్న, మంగ సుధాకర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** దేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నీట్ పరీక్ష అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ నేలకొండపల్లి మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ పరీక్షలో అక్రమాలకు, పేపర్ లీకేజీలకు పాల్పడిన దోషులను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీచార్జ్ అత్యంత హేయమైన, ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్య అని ఖండిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అణచివేసే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదని స్పష్టం చేశారు. విద్యార్థులపై జరిగిన నిర్బంధ అమానుష చర్యలకు గాను ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, పరీక్షల నిర్వహణ తీరులోనూ, విద్యావ్యవస్థలోనూ తక్షణమే సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు వారిపై బలప్రయోగానికి దిగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. విద్యార్థి నాయకులను చర్చల పేరుతో పిలిచి నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తెలిపారు. విద్యార్థుల సమస్యలను అణచివేయకుండా వారితో చర్చించి న్యాయమైన పరిష్కారం చూపాలని, వారి డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మారిశెట్టి వేంకటేశ్వర రావు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

# గర్భిణులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గర్భిణీలు బాలింతలకు ప్రభుత్వం అందించే అన్ని వైద్య సదుపాయాలు సకాలం అందించి నాణ్యమైన వైద్యసేవలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. గురువారం రామవరంలోని మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి ప్రాంగణం పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. సిబ్బంది హాజరు మందుల నిల్వలు రికార్డులను పరిశీలించిన ఆయన సమయపాలనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజల్లో ప్రభుత్వ ఆస్పత్రులపై మరింత నమ్మకం కలిగేలా సేవలు అందించాలని సూచించారు.

# నేటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/జూలూరుపాడుః** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి యువతపై విచక్షణరహితంగా లాఠీ ఛార్జ్ చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని నేడు 24న విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్ కు వామపక్ష యువజన సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాయని, ఈ బంద్ కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, మేధావులు, యువత,ప్రజలు సహకరించాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కె చాంద్ పాషా కోరారు. 24న విద్యార్థి సంఘాలు నిర్వహించే విద్యాసంస్థల బంద్ లో యువత, ప్రజలు మేధావులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# జూలూరుపాడులో నాకాబందీ..!



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** జూలూరుపాడు మండలకేంద్రంలో పోలీసులు గురువారం నాకాబంధీ నిర్వహించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఎస్సై జీనత్ కుమార్ సిబ్బందితో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ ఆదేశాను సారం పోలీసులు ఉదయం 8 గంటల నుంచీ 11 గంటల వరకు మూడు గంటల పాటు ప్రతీ వాహనాన్ని క్షుణంగా తనిఖీచేశారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు, గంజాయి. మత్తు పదార్థాలా అక్రమ రవాణకు అడ్డకట్ట వేసేందుకే ఈ తరహా ఆకస్మిక తనిఖీలు చేసామని జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. నంబర్ ప్లేట్ లేని లేదా ట్యాంపర్ చేసిన నంబర్ ప్లేట్లు కలిగిన వాహనాలను తనిఖీ చేసి ఫైన్ వేశారు. అలాగే ఎక్కువ మొత్తంలో పెండింగ్ చలాన్లు ఉన్న వాహనదారులతో అక్కడికక్కడే చలాన్లు చెల్లింపజేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్లో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో భాగంగా హెల్ప్ డెస్కుల ఏర్పాటు

**ప్రజాపక్షం/మణుగూరుః** సర్ ప్రక్రియలో భాగంగా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడం జరిగిందని మణుగూరు తహశీల్దార్ అద్దంకి నరేష్ గురువారం తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కూడా మణుగూరు మండలంలోని అన్ని గ్రామపంచాయితీలు,మున్సిపల్ పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించ బడుతున్నాయన్నారు. ఈ ప్రత్యేక శిబిరాలు ఉదయం గం. 8:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించబడతాయన్నారు. రాజీవ్ గాంధీ నగర్ ఏరియా పరిధిలోని ఓటర్ల కోసం మార్కెట్ యార్డ్ వద్ద, అలాగే పీవీ కాలనీ, కూనవరం ఏరియా పరిధిలోని ఓటర్ల కోసం సీఈఆర్ సింగరేణి క్లబ్ వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. మండలంలోని అర్హులైన ఓటర్లందరూ సంబంధిత పత్రాలతో ప్రత్యేక శిబిరాలకు హాజరై ఎన్యూమరేషన్, ఆన్‌లైన్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయించుకుని ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# రెమిడీయేషన్ శిక్షణతో విద్యార్థుల అభ్యాసంలో గుణాత్మక మార్పు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ప్రాథమిక స్థాయిలో వెనుకబడిన విద్యార్థులను అభ్యాసంలో ముందుకు తీసుకురావడంలో రెమిడీయేషన్ శిక్షణ కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారిణి వాసంతి అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్‌లో భాగంగా అశ్వాపురం మండలం జెడ్పిహెచ్‌ఎస్ మిట్టగూడెంలో జరుగుతున్న శిక్షణను డీఈవో వాసంతి, ఏఎంఓ మాధవరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల్లో వెనుకబడిన విద్యార్థులకు రెమిడీయేషన్ ద్వారా మెరుగైన అభ్యాస ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి వి వీరస్వామి, రిసోర్స్ పర్సన్లు, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అశ్వాపురంలో పోలీసుల నాకాబందీ

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల కేంద్రంలోని చింతిర్యాల క్రాస్‌రోడ్ వద్ద గురువారం డిఎస్‌పి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక నాకాబంది నిర్వహించారు. ఈసందర్భంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లారీలు తదితర వాహనాలను తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్సులు, వాహన పత్రాలను పరిశీలించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లను అక్కడికక్కడే చెల్లించేలా చర్యలు చేపట్టారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. ఈ నాకాబంది కార్యక్రమంలో సీఐ ఎల్లయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అనుచిత వ్యాఖ్యలతో గౌరవాన్ని పోగొట్టుకుంటున్న న్యాయ వ్యవస్థ




**-ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**
**-యువజన విద్యార్థుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుచిత వ్యాఖ్యలతో దేశంలోని న్యాయ వ్యవస్థ గౌరవాన్ని పోగొట్టుకుంటుందని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. దేశాన్ని అట్టుడికిస్తున్న జంతర్ మంతర్ ఆందోళనలకు సంబంధించిన వీడియోలు చూసే తీరిక కానీ కేసు వినే సమయం కానీ లేదని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించడం శోచనీయమని ఎవరి మెప్పు కోసం ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆయన తెలిపారు. గురువారం సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగారావు మాట్లాడుతూ క్రాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసన ప్రదర్శనకారులపై పోలీసులు సాగించిన దమనకాండను మాస్‌లైన్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని దీనిపై న్యాయ విచారణకు డిమాండ్ చేస్తున్నామన్నారు. శాంతియుతంగా తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న వారిపై లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాన్ని తాము తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. విద్యార్థి మరణానికి మోదీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఇది రాజ్యం చేసిన హత్యగా రంగారావు అభివర్ణించారు. కేంద్ర,రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యా హక్కును కేంద్ర ప్రభుత్వం అభిప్రాయ సేకరణ చేయకుండానే ఆధిపత్యంలోకి తీసుకుని నీట్ పరీక్షను నిర్వహించడం ప్రారంభించిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది 23 లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేసేవిధంగా ప్రశ్నా పత్రం లీకై దేశ వ్యాప్తంగా 20 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని మోదీ ప్రభుత్వం దీనిపై కనీసం పశ్చాత్తాపం తెలిపే పరిస్థితిలో కూడా లేదన్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువజనులు ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ఉంటుందన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల రైతాంగ పరిస్థితులపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం తగు రీతిలో చర్యలు చేపట్టాలని రంగారావు కోరారు. కాళేశ్వరం నీటి వినియోగానికి సంబంధించి బేషజాలకు పోకుండా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు. మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర కమిటీ నిర్ణయాలను ఆయన వివరించారు. మీడియా సమావేశంలో సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు కెజి రాంచందర్, కె. రంగయ్య, కె. రమా, గుమ్మడి నర్సయ్య, వి. కృష్ణ, పద్మ, చిన్న చంద్రన్న, చంద్ర అరుణ, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, కె. సూర్యం పాల్గొన్నారు.

# ఢిల్లీలో పోలీస్ హింసాకాండపై న్యాయ విచారణ జరిపించాలి

**-విద్యార్థి మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి**
**-న్యాయమూర్తి వ్యాఖ్యలు అర్థరహితం**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న యువజన విద్యార్థులపై పోలీసులు సాగించిన హింసాకాండను సిపిఐ తీవ్రంగా నిరసిస్తుందని ఇందుకు సంబంధించి న్యాయ విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఐ జిల్లా సమితి పక్షాన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన ప్రభుత్వం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై అత్యంత పాశవికంగా దాడి చేసిందని దారుణంగా ఉన్న వీడియోలను చూస్తుంటే మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య స్థానే నియంతృత్వ ఆలోచనలు చేస్తుందన్న భావన బలపడుతుందని సురేష్ తెలిపారు. పోలీసులకు విస్తృత అధికారాలు ఇవ్వడం, ఎటువంటి అభియోగాలు లేకపోయినా ఏడాది పాటు నిర్బంధించే అవకాశాన్ని కల్పించడం ఏ ప్రజాస్వామ్యంలో ఉందని ఆయన ప్రశ్నించారు. విద్యార్థి మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఇది కేంద్ర ప్రభుత్వం చేసిన హత్యగా సిపిఐ భావిస్తుందని సురేష్ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలలో న్యాయం దక్కనప్పుడు న్యాయ స్థానాలను ఆశ్రయించడం హక్కు అని కానీ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు పలు అనుమానాలకు తావివ్వడంతో పాటు ఆవేదన కలిగిస్తున్నాయని సురేష్ తెలిపారు. దేశాన్ని అట్టుడికిస్తున్న ఓ ప్రధాన సమస్యపై న్యాయమూర్తికి వినే తీరిక లేదనడంతో పాటు నా సమయాన్ని వృథా చేయవద్దని అనడం శోచనీయమన్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోయిన నాడు ఆవేదన నుండి ఆవేశం పురుడుపోసుకుంటుందన్న వాస్తవాన్ని న్యాయమూర్తులు గ్రహించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులకు అనుగుణంగా ఖమ్మం జిల్లాలో తక్షణ చర్యలు చేపట్టాలని ఉపాధి కల్పన రంగాలను మెరుగుపర్చాలని రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు కరువు ప్యాకేజీని ప్రకటించాలని సురేష్ డిమాండ్‌చేశారు. దేశంలో యువత సాగిస్తున్న శాంతియుత ఉద్యమాలకు 24వ తేదీన జరుగుతున్న బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సురేష్ తెలిపారు.

# ఆరుతడి పంటలపై రైతులు దృష్టిసారించాలి

**-ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రైతులు అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయవద్దని ఆయన తెలిపారు. ఆరుతడి పంటలైన అపరాలు, చిరుధాన్యాలు సాగు చేయాలని ఆయన సూచించారు. బద్యాతండాలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన వ్యవసాయ పద్ధతులు, ఆరుతడి పంటల సాగు, పప్పు జాతి పంటలు, చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి నగేష్, కోటపాడు, బద్యాతండా సర్పంచ్ కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, సునావత్ పెంట్యా, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. కోటపాడులోని మిర్చి నర్సరీని ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు సందర్శించారు. నీటి వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు.

# సర్వేను అడ్డుకున్న రైతులు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నాగపూర్ అమరావతి జాతీయ రహదారి నిర్మాణం కోసం మండలంలో భూసేకరణకు సంబంధించి సర్వేను రైతులు అడ్డుకుని ప్రతిఘటించారు. గురువారం రఘునాథపాలెం ఆపిల్ సెంటర్ వద్ద నేషనల్ హైవే అధికారుల సర్వేను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు జేసిబిలతో పంట పొలాల్లోకి ప్రవేశించి మొక్కలను తొలగిస్తూ భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయగా రైతులు, రైతు సంఘాల నాయకులు అడ్డుకున్నారు. దీనితో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సారవంతమైన వ్యవసాయ భూములను నేషనల్ హైవే పేరుతో స్వాధీనం చేసుకోవద్దన్నారు. రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారని ఈ నెల 28న తీర్పు రిజర్వులో ఉన్న ప్పటికీ పోలీసుల అండతో భూసేకరణకు దిగటం చట్టవిరుద్ధమన్నారు.



రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్, ఎస్ఐ తేజేశ్వర్ రెడ్డి బందోబస్తు మధ్య తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ, నేషనల్ హైవే అధికారులు భూసేకరణ చేపట్టారు. రైతు సంఘాల నాయకులు బొంతు రాంబాబు, నవీన్ రెడ్డి, రైతు జేఏసి నాయకులు తక్కెళ్లపాటి భద్రయ్య, నాగండ్ల శ్రీధర్, పాపినేని రామనర్సయ్య, కిషోర్ పాల్గొన్నారు.

# భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/పాల్వంచ :** భూముల రీ సర్వేకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించి సర్వే సమయంలో అధికారులకు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ఆధారాలను అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పాల్వంచ కరకవాగులో గల సర్వే నెంబర్ 727లో కొనసాగుతున్న భూ రీసర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భూ రీసర్వే పనుల పురోగతి, అనుసరిస్తున్న విధానం, భూముల హద్దుల నిర్ధారణ తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ రీ సర్వే పూర్తి అయితే భూముల హద్దులపై స్పష్టత ఏర్పడి భూ వివాదాలు తగ్గడంతో పాటు భూ రికార్డులు మరింత పారదర్శకంగా ఉంటాయని తెలిపారు. భూ రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ తహశీల్దార్ దారా ప్రసాద్, సర్వేయర్లు పాల్గొన్నారు.

# కుష్టును జయించొచ్చు..
# నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యం తప్పదు



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం చేయవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. గురువారం ఖమ్మం వరంగల్ క్రాస్‌రోడ్డులోని కుష్టు వ్యాధిగ్రస్తుల కాలనీలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30వ డివిజన్ కార్పోరేటర్ కలిగిన కుష్టు బాధితులకు ఎంసీఆర్ చెప్పులు, బ్యాండేజీలు, కాటన్, పుండ్లకు అవసరమైన ఆయింట్‌మెంట్లు, సపోర్ట్ డ్రగ్స్ పంపిణీ చేశారు. వైద్యులు బాధితులకు వ్యక్తిగత పరిశుభ్రత, పుండ్ల సంరక్షణ, వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శరీరంపై మచ్చలు, స్పర్శ తగ్గడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, ప్రారంభ దశలోనే చికిత్స తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఎంఓ మల్లయ్య, ఫిజియోథెరపిస్టు భద్రు, నోడల్ పర్సన్ సుధాకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వివిపాలెంలో గంజాయి కలకలం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో గంజాయి కలకలం సృష్టించింది. గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో గంజాయి విక్రయాలు జరుపుతున్నారన్న సమాచారంతో ఈగల్ టీమ్, రఘునాథపాలెం పోలీసులు తనిఖీలు నిర్వహించగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కల్లూరు మండలంకు చెందిన ఓ వ్యక్తి ఫైనాన్స్ కంపెనీలో విధులు నిర్వహిస్తూ వి. వెంకటాయపాలెం గ్రామంలో భార్య, బావమరిదితో కలిసి కిరాయికి ఉంటున్నాడు. ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే వ్యక్తి స్నేహితుడైన సారపాకకు చెందిన వ్యక్తి ఈరోజు వెంకటాయపాలెం వచ్చాడు. వారం రోజుల క్రితం భద్రాచలంలో ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే అతని బావమరిది గంజాయి కేసులో పోలీసులకు పట్టుబడ్డాడు. అతను ఇచ్చిన సమాచారంతో ఈగల్ టీమ్, రఘునాథపాలెం సిఐ ఆధ్వర్యంలో సిబ్బందితో వి. వెంకటాయపాలెంలో సోదాలు నిర్వహించగా గంజాయి పట్టుబడినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఏడాదిగా ఇంట్లో అద్దెకు ఉంటూ గుట్టుచప్పుడు కాకుండా గంజాయి దందా కొనసాగించడం అది కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉండటం కొసమెరుపు. గంజాయి కలకలంతో గ్రామస్తులు కూడా భయాందోళనతో ఉలిక్కిపడ్డారు.

# విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

**-వామపక్ష యువజన సంఘాల పిలుపు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలో యువజన విద్యార్థులపై జరిగిన దాడికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న విద్యార్థి సంఘాలు తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. ఏఐవైఎఫ్, డివైఎఫ్ఐ, పివైఎల్ ఆధ్వర్యంలో రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో యువజన సంఘాల సమావేశం జరిగింది. నీట్ లీకేజీ కారణంగా 21 మంది అమాయకులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఇందుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విద్యార్థి,యువతపై జరిగిన దాడికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో యువజన సంఘాల నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఎన్‌వి రాకేష్, జక్కుల భరత్, మద్దోజు శ్రవణ్, చింతల రమేష్, డి.అశోక్, మామిడాల కిరణ్, శ్రీకాంత్, ప్రణయ్ పాల్గొన్నారు.

# 28, 29 తేదీల్లో
# అతిథి అధ్యాపక ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026 27 విద్యా సంవత్సరానికి సంబంధించి అతిథి అధ్యాపక ఎంపిక కోసం ఈనెల 28, 29 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. 28న కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్, డేటా సైన్స్, బిసిఏ, బిబిఏ, బిజినెస్, గణితం, ఇంగ్లీష్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 29న బయోటెక్నాలజీ, తెలుగు, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని జాకీరుల్లా తెలిపారు.